**కథ**

# "జీవితమంటే...?"

**-దాసరి శిరీష**

"స్నేహితుడిగా నా మీద మమకారంతో నన్ను కాస్త బాగుచేద్దామని వచ్చావు. నన్ను ప్రశాంతపరచడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నావ్. జోహర్లు. నీ ప్రయత్నానికి ఏ మాత్రం సహకరించలేని స్పందించలేని ఎడారిలాంటి మనస్సుతో ఉన్నాడు నీ చంద్రం" సిగరెట్ కాలుస్తూ రమణవైపు చూసి విచారంగా నవ్వాడు.

" ప్రపంచంలో నువ్వొక్కడివే బాధితుడవనీ... నిన్ను మాత్రమే నిత్యం దుఃఖం వెన్నంటుతోందనీ అనుకోకు. సంతోషం అనేది సాధన వలనే వస్తుంది.హఠాత్తుగా రాదు.

"నీ గురించి పూర్తిగా మీ కొలీగ్ శంకర్రావు వివరించాడు. నువ్వు నాతో హైదరాబాద్ వస్తున్నావు రేపు."

"నన్నొదిలేయి"

"లేదు ఇప్పటికే చాలా ఆలస్యమయింది." రమణ చంద్రాన్ని పరిశీలనగా చూస్తూ నిట్టూర్పు ఆపుకుని అన్నాడు. "ఇరవయ్యోతారీఖున నీ అభిమాన గాయకుడి ప్రోగ్రాం ఉంది రవీంద్ర భారతిలో. ఆ ప్రోగ్రాం వింటే ఒక సంవత్సరానికి సరిపడా శక్తి వస్తుంది."

"ఎందుకు నీ కింత దయ!"

"ఒరేయ్!"

"నేను జీవితంతో నిత్యం యుద్ధం చేసుకుంటూ బ్రతుకుతున్నాను! అసమర్థుడిగా కుటుంబంలోనే ముద్రవేయించుకున్నాను. నీ కన్నీ తెలిసే ఉండాలే!" నవ్వలేక నవ్వుతూ అన్నాడు.

"తెలిశాయి".

"అయినా నా కోసం ఎందుకీ ప్రయత్నాలు! నా కొడుకు అలిగి ఎక్కడకి వెళ్లాడో తెలియదు. డబ్బు పెట్టో... ఎవరి కాళ్ళయినా పట్టుకునో... వాడికో గవర్నమెంటు జాబ్ వచ్చేలా చేయలేదని కోపం. కూతురు కాపరం సరిగ్గా లేదని చంటి బిడ్డతో సహా వచ్చింది. చివరి పిల్ల... మంచి పాప తెలివిగలది. మంచి భవిష్యత్ చూపించగలనో లేదో! ఇవి అందరికీ ఉండే సమస్యలయినా నన్ను భూతాల్లా భయపెడుతున్నాయి. ఇలా ఉంటుంది జీవితం అని నేననుకోలేదు. నవ్వకు... అసలీ సంసార రథాన్ని సజావుగా నడిపించడమే నాకు తెలియడం లేదు. ప్రయత్నించాను. చాలా మంది తీర్మానం ప్రకారం విఫలమయ్యాను ఈ జీవితం కోసమా నేనింత కలలు కన్నాను.! తపించాను!"

స్నేహితుడి ఆవేశాన్ని ముఖ కవళికలనీ గమనిస్తూ ముగ్ధుడయ్యాడు రమణ. జీవితపు రహదారిలో చెరో వైపు మళ్ళినా చంద్రం భావుకత... సున్నితత్వం తనెప్పుడూ గుర్తు చేసుకుంటూనే ఉండేవాడు. నానా తంటాలూ పడీ ఓ మాదిరి సినీనటుడిగా తను నిలదొక్కుకున్నాడు. ఎంతో అభినివేశం ఉన్న చంద్రం మాత్రం... ఏమీ కాకుండా ఓ ప్రభుత్వ యంత్రాంగంలో చిన్న అధికారిగా స్థిరపడ్డాడు. అది అతని ప్రపంచం కాదు. తన భావాలూ... విలువలూ తిరగబడి వెక్కిరించే విచిత్రమైన వ్యథాపూరిత ప్రపంచంలో ఏళ్ళ తరబడీ సంఘర్షణ పడడం చంద్రం లాంటి వాళ్ళకి శక్తికి మించిన పనే.... కత్తి మీద సామే.

"నా గొడవ ఎప్పుడూ ఉండేదే గాని నీ గురించి చెప్పు శాంతిగా ఉన్నావా? సినీ మాయల్లో పడి సంతోషం గూడా ఎరువు తెచ్చుకున్నావా!

"నీ కన్నా ఫర్వాలేదు. ఫర్వాలేదేమిటి తప్పు తప్పు నీ కన్నా చాలా సుఖంగా, సంతోషంగా ఉన్నాను. వచ్చి చూడు. నిన్నూ అలాగే ఉంచాలని ఆశిస్తున్నాను."

"వద్దు ఆశించకు భయ్యా"

"నలభయి దాటాక ప్రతి వ్యక్తీ ఇలాగే అనుకుంటాడు మళ్ళీ జన్మించే అవకాశం ఉంటే బోల్డన్ని లోపాలు సరిదిద్దుకుని సుఖపడదాం అనుకుంటాడు పాపం."

"కాదు బ్రదర్ నన్నర్థం చేసుకో నన్ను బాగా ఎరిగిన నేస్తానివి. నేనెక్కడికీ వచ్చి ఎంజాయ్ చేసే పరిస్థితిలో లేను" దీనంగా చూశాడు.

ఇంతలో శారద కాఫీలు తీసుకొచ్చింది. ఆమె మొహం అప్రసన్నంగా ఉంది.

"అదికాదులే అన్నయ్యా నేనూ... పిల్లలూ... ఈ సంసారమూ ఆయనకి ఇనప సంకెళ్ళయిపోయాయి. మా కన్నా వెనక పెళ్ళిళ్ళయిన వాళ్ళు గూడా ఎంత బాగా సంసారాలు నడుపుకుంటున్నారో ఎంత బాగా పైకి వచ్చారో! ఎందుకులే ఆయన ప్రాణానికి మేం..."

"నువ్వు పూర్తిగా రైటు శారదా! నా లాంటి వ్యక్తితో నువ్వు చాలా ప్రయాసగా సంసారాన్ని లాక్కొస్తున్నావు. నీకు తగిన భర్తని కానే కాదు.

"నే నే మీకు తగిన భార్యని కాదు"

"నిన్ను చాలా కష్టపెట్టాను. బాగా సంపాదించి నిన్ను సుఖాలలో ముంచి తేల్చ లేకపోయాను"

"చాలా లేటుగా బోల్డన్ని గుర్తించావు గాని చంద్రం... ఇద్దరూ ఆపండ్రా" చిరాకు అణచుకుని నవ్వాడు రమణ - చంద్రం భుజాల చుట్టూ చెయ్యి వేసి "శారదా ఈ రాత్రిమేమిద్దరం హైదరాబాద్ వెడుతున్నాం వీడి మైండ్ చాలా రిపేర్ చెయ్యాలి నేనిక్కడికి షుటింగ్‌కి రాకపోతే నాకసలు ఏమీ తెలిసేవి కావు. ఈ మధ్య చాలా గాప్ వచ్చింది." అన్నాడు.

"తీసికెళ్ళండన్నయ్యా మీ దగ్గరయినా క్షేమంగా ఉంటే అంతేచాలు. మా పాట్లు మేం పడతాం" అంది.

"అన్నీ చక్కబడతాయి" రమణకి సంభాషణ ముగించడం మంచిదనిపించింది. ఓ భార్యభర్తల సంభాషణ సాధారణంగా ఇంతకన్నా బావుండదు అనుకున్నాడు.

ట్రెయిన్ ఎక్కాక చంద్రం మొహంలో ఏదో నిశ్చింత కనిపిస్తోంది. ఈ రెండ్రోజులుగా నిస్తేజమైన చూపులూ అదోరకమైన వేదాంతం .... ద్వేషించడం అలవాటు లేక తనను తాను హింసించుకోవడం .... చంద్రాన్ని మామూలు మనిషిగా చేయడం సాధ్యమేనా అని మథన పడ్డాడు.

కొండలూ గుట్టలూ ... చెట్లూ పుట్టలూ గమనిస్తున్న చంద్రం ఎందుకో నవ్వాడు. అతన్నే గమనిస్తూ ఎదురుగా కూర్చున్న రమణ ఆ నవ్వు చూసి చాలా రిలీఫ్‌గా ఫీలయ్యాడు. ఉత్సాహంగా అతన్ని గమనించాడు. చాలా సేపు అలాగే పరధ్యానంగా బయటకు చూసి తలతిప్పి రమణతో అన్నాడు "ఈ వయస్సులో అందరికీ నిరాశావాదమే వస్తుందా... అసలు నాకు జీవితం అర్థం గాలేదు." బాధగా చూశాడు.

"నడి వయస్సులో చాలా పశ్చత్తాపాలు మొదలవుతాయి. ఫలించని ప్రేమా... తియ్యగా బాధించే బాల్య స్మృతులూ చేయాలనుకుని చేయలేకపోయిన ఉదాత్తమైన పనులూ.... వీటన్నిటి మధ్యా తొందరగా ముగింపుకొస్తుందేమో జీవితం అనే ఆందోళనా.... ఇవన్నీ కలగాపులగమై నేను చాలా ఒంటరివాడని అనే భావాన్ని ఎక్కువ చేస్తాయి." అనునయంగా అన్నాడు రమణ.

"నేను భర్తగా ... తండ్రిగా ఆఖరికి ఉద్యోగిగా గూడా ఫెయిలయ్యాను. శంకరం అన్నీ చెప్పాడుగదా. అతనొక్కడే ఈ నగరంలో నాగురించి ఆరాటపడే పిచ్చివాడు. మంచి సీటులో ఉండిగూడా మడిగట్టుకుని కూచున్నానని మా సెక్షన్ సిబ్బందికీ నా భార్యకి నేనంటే చాలా కోపం. తన అసంతృప్తి పిల్లలకి బాగా ఎక్కించి వాళ్ళనీ దూరం చేసింది. ఆమెని నేను తప్పు బట్టను. ఇప్పటికీ ఆమెలో హృదయం పలకదు వ్యవస్థకి ప్రతీకగా నిలిచే ఓ కంఠం ... ఆరాటపు వెటకారంతో నన్ను కించపరుస్తుంటుంది. తట్టుకునే ప్రయత్నంలో నేనెక్కడో అగాధాల్లో పడిపోతున్నాను."

పూర్తిగా అన్నీ అర్థమయిన వ్యక్తికి ఏం చెప్పి ఓదార్చగలడు! తడికళ్ళతో మిత్రుడి వైపు ప్రేమగా చూశాడు రమణ.

ఎవరో ఇద్దరు గుడ్డి వాళ్ళు డోలక్ వాయించుకుంటూ స్వేచ్ఛగా పాడుకుంటూ వస్తున్నారు. అప్రయత్నంగా వాళ్ళవైపు కళ్ళు తిప్పిన చంద్రం మొహం ఎందుకో వికసించింది. వాళ్ళు బాగా పాడుతున్నారు. రమణ గూడా ఉత్సాహంగా వినసాగాడు. చంద్రంలో ప్రతి చిన్న మార్పుకీ అతను స్పందిస్తున్నాడు.

* * *

"ఇస్ సెహర్ మె కిస్సే మిలే"

"హమ్‌సేతో ఝూటీ మెహఫిలే"

"హర్‌సన్స్ తేరా నామ్ మిలే"

రమణ అలవోకగా మిత్రుడ్ని గమనించ సాగాడు. చంద్రం అస్థిమితంగా కుర్చీలో కదిలాడు మనస్సు విహంగం రెక్కలు విదిలించుకున్నపుడు కలిగే కదలిక అది. వింత బాధలో అవ్యక్తమైన మధురిమ.

"కల్ చౌదవీక్ రాత్

కుచనే కహా చాంద్ థీ కుచ్‌నే కహా సచ్చా తెరా. ఆ కాసెట్ వింటున్నప్పుడే గొప్ప ఆరాధన కలిగింది అతని మీద.

ఇప్పుడు ఎదురుగా పాడుతున్నాడు. హృదయాన్ని నిర్మల మయం చేస్తూ ఎక్కడికో తీసికెడుతున్నాడు. చంద్రం ఇప్పుడు పాత చంద్రంలా ఉన్నాడు. పాటల గురించి ఎంత అనర్గళంగా తన్మయంగా మాటాడే వాడు! రమణ ఆశ్చర్యంగా సంతోషంగా చంద్రాన్ని పరిశీలిస్తున్నాడు. ఆ కళ్ళల్లో మెరుపూ... ఆ తేజస్సూ మళ్ళీ చూడగలనా అనుకున్నాడు.

'జంగల్ తెరా పరబత్‌తెరా"

చంద్రం చాలా అర్ధమయిందన్నట్టుగా కులాసాగా వెనక్కి వాలాడు. చిరునవ్వుతో పెదాలు విచ్చుకున్నాయి. రమణా నువ్వు దేముడివి గురూ! నాలాంటి పిచ్చివాడని పట్టించుకునే తీరిక ఎవరికుంది!



ఈ సారి గజల్ ఎత్తుకున్నాడు. "ఉమర్ జల్వాన మె" చప్పట్లు అలలు అలలుగా మోగాయి. గజల్ ప్రపంచమే వేరుగా ఉంటుంది. కళాత్మకతా ఆర్ద్రతా నిండిన ప్రేక్షకులతో ఆ వాతావరణం రమ్యంగా, చైతన్యంగా ఉంటుంది. చంద్రం పూర్తిగా లీనమయ్యాడు.

"ఇలా బ్రతకాలనుకున్నా" అన్నాడు హఠాత్తుగా ఉద్రేకంగా. "మంచిదే, జగ జీత్ సింగ్ గూడా విషాదపు శిథిలాల మధ్య నేనడుస్తూ వచ్చాడు. చదివే ఉంటావుగా."

"నిజమే నిజమే. అయినా అతను వేరు" నాలాంటి దౌర్భాగ్యపు మనస్సు కాదు అనే అర్థముంది ఆ మాటల్లో.

"జీవితం విలువ తెలిస్తే... ఇంకో వైపు నుండయినా ఆస్వాదించడం చాతనయితే ఎవరూ ఆత్మహత్యా ప్రయత్నాలు చేయరు" రమణ గంభీరంగా అన్నాడు. చంద్రం ఉలిక్కి పడి చూశాడు. ఇంతలో దేర్‌లగీ అని జగ్ జీత్ అంటుంటే కళ్ళు చెవులూ అప్పగించాడు. చంద్రాన్ని చూస్తూ సంగీతానికెంత శక్తి ఉందీ అనుకున్నాడు రమణ.

పిండారబోసినట్టున్న వెన్నెల్లో గులాబీల మరువం మెత్తటి వాసన హాయిగా అని పిస్తుంటే సిట్ అవుట్లో కూచుని మాటాడు కుంటున్నారు. మిత్రులిద్దరూ. ఎదురుగా దృశ్యాలు మనోహరంగా ఉన్నాయి. అందానికి కూడా ఎంత మూల్యం చెల్లించుకోవాలో కదా? "నీకు నచ్చినట్టుగా స్థిరపడ్డావు. ఈ వారమంతా చాలా బాగా గడిచింది." చంద్ర అన్నాడు.

"నాకూ అంతేగదా చంద్రం. ఇప్పుడన్నీ కృత్రిమ బంధాలు మనస్సు విప్పాలన్నా ఎంతో భయం"

కాస్సేపు మౌనంగా ఉన్న చంద్రం రమణ వైపు తిరిగాడు. "అవునూ ఇంట్లో నర్సయ్య తప్ప ఎవరూ కనిపించరేం!"

రమణకి బాగా నవ్వొచ్చింది. "ఫర్లేదు లౌకికమైన విషయాలు గూడా నీ దృష్టిలో ఉన్నాయన్న మాట. అసలు ప్రశ్నలు సాధారణంగా రావు కదా"

"నువ్వూ పెళ్ళి చేసుకున్నావుగా! ఆమె... పిల్లలూ"

"నేను పెళ్ళి చేసుకోలేదు. ఈ సినీ ప్రపంచంలో నిలదొక్కుకుని మా అమ్మ అప్పగించిన బాధ్యతలు నెరవేర్చేసరికి ముప్ఫయి నాలుగు వచ్చాయి. పంకజ అని నాతో పాటు చాలా సినిమాల్లో సహాయనటిగా నటించింది. ఎన్నో అటుపోట్లకి గురయి కూడా నిబ్బరంగా నిలబడింది. ఓ బాబుతో నా దగ్గరకొచ్చింది. పదేళ్ళు కలసి ఉన్నాం."

"మీకు మరి పిల్లలూ"...

"ఆమె అప్పటికే ట్యూబెక్టమీ చేయించుకుంది. ఆమెతో బాబుతో కలిసే నీకు రెండు మూడుసార్లు కనబడ్డా." ఎటో చూస్తూ అన్నాడు. జ్ఞాపకాలలో ఉద్విగ్నంగా మారింది మొహం. "వాళ్ళేరి?" ఆసక్తిగా అడిగాడు.

రమణ కాస్సేపు మాటాడలేదు. తటపటాయింపుగా నవ్వి "ఆమె పోయింది ఓ ఆక్సిడెంట్‌లో. బాబూ నేనూ దెబ్బలతో బయట పడ్డాం. వాడిప్పుడు బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. వాడే నాకు బంధం. నువ్వు మనస్సు పాడు చేసుకోకు చంద్రం "ఉమ్ర్ జలనోమె బసర్‌హోవి జికూరీతో నహీ" అనలేదా జగజీత్ సింగ్ చలనమే జీవిత గమనం" వేదాంతిలా నవ్వాడు రమణ.

చంద్రం ఏమీ అనలేదు. ఆకాశం వైపూ దూరంగా కనిపించే లైట్స్ వైపూ చూస్తూ గడిపేశాడు. రమణని ఓదార్చే అర్హత కూడా తనకి లేదు.

"భోంచేద్దామా చంద్రం"!

"పద" ఇద్దరూ లోపలికి నడిచారు. నర్సయ్య డైనింగ్ టేబిల్ మీద అన్నీ పెట్టి "రండయ్యా ఏమయిందయ్యా"! అన్నాడు ఖంగారుగా రమణని చూస్తూ, ఆల్బమ్ చూస్తున్న చంద్రం భయంగా రమణ దగ్గరకి నడిచాడు. గుండె పట్టుకున్న రమణ ఏమీ లేదన్నట్టు నవ్వి నర్సయ్య వైపు చూశాడు. "ఏమీ లేదు చంద్రం ఆ టాబ్లెట్ నాలుక కింద పెట్టుకుంటే మళ్ళీ నార్మల్‌గా అయి పోతాను. అంత సేపు వెదుకుతున్నావే నర్సయ్యా లేదా?" అన్నాడు ఆయాస పడుతూ. "ఆ మందు కనబట్టం లేదయ్యా ఫోన్ చేద్దాం డాక్టర్‌గార్కి" అని రింగ్ చేయబోయాడు. మందుల బాగ్‌లో మడిచి ఉన్న కాగితం చంద్రానికి అందించి "ఆడౌన్‌లోకి దిగితే..."

చంద్రం మెరుపులా బయటకు దూసుకుపోయాడు. ఏమిటీ అని ప్రశ్నించే సమయం లేదు. రమణ ఆ టాబ్లెట్ నాలుక కింద పెట్టుకుని మళ్ళీ మామూలు మనిషి అయ్యేవరకూ అతని దడ తగ్గలేదు. వెర్రి వాళ్ళా రమణ వైపే చూస్తూ నిలబడ్డాడు. రమణకి ఈ బాధే మిటి అనిపించింది.

ఓ గంట తర్వాత భోజనం చేస్తూ రమణ అన్నాడు. "భయపడ్డావురా! మా ఇద్దరికీ మామూలు విషయమే. టాబ్లెట్స్ అయిపోయాయని చూసుకోలేదు."

"నీ కేమీ.... దేనిగురించీ భయం లేదు" అతికష్టంగా అన్నాడు.

"భయమా... ఎందుకంటా?" నవ్వి చంద్రానికి కూరవేశాడు.

"ప్చ్... మరీ ఇంత మొండి ధైర్యమా"?

"హర్ట్ ఎన్‌లార్జ్‌మెంటనే జబ్బు వరించింది. అది గారం చేసినపుడల్లా సినిమాల్లో చూపించినట్టు అప్పుడప్పుడూ గుండె పట్టుకుంటూ ఉంటాను. నాకు జీవితమంటే ఇష్టం, ప్రేమ. అందుకే శ్రద్ధగా మందులు వాడుతూ ఆరోగ్యం కాపాడుకుంటూ ఉంటాను. జీవించడమనే అద్భుతమైన, ఆనందకరమైన అనుభవాన్ని వదలగలమా! నర్సయ్య ఎంత బాగా వండుతాడు! అందుకోసం ఓ వందేళ్ళు బ్రతకొచ్చు. సాంబారు వేసుకో చాలా బావుంది."

చంద్రం ఆప్యాయంగా కలుపుకుంటూ "నాకూ చాలా ప్రేమగా ఉంది జీవిత మంటే" అన్నాడు హుషారుగా భార్యా పిల్లల్ని తల్చుకుంటూ.